క్లుప్తంగా

5న కొండనాగుల డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

బల్మూర్: ఈ నెల 5న మండలంలోని కొండ నాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఫాక్స్ కాన్' కంపెని కొంగర కలాన్ హైదారాబాద్ వారు 'జాబ్‌మేళా' నిర్వహిస్తునట్లు ప్రిన్సిపాల్ పరంగి రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాసు లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. సర్టిఫికెట్స్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్‌లు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆధార్ కార్డులను తప్పనిసరి తీసుకురావాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌ల పంపిణీ



తాడూరు: మండలంలోని పర్వతాయిపల్లి ప్రాథమిక పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు శక్రువారం పాఠశాల ఉపాధ్యాయుడు ఏఎం ఆనంద్‌రాజ్ స్వంత ఖర్చులతో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం కేపీ చంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు మణెమ్మ, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

బిజినేపల్లి: మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఎంఈఓ రఘునందన్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పాఠశాలలో పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు గణిత స్టడీ మెటీరియల్ అందజేత



అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం మిత్రమండలి 1984–85 ఎస్ఎస్‌సీ బ్యాచ్ ఆధ్వర్యంలో డాక్టర్ కె.వి గిరిధర్ స్మారకార్థం గణిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిత్రమండలి గౌరవ అధ్యక్షుడు గంగాపురం శ్రీనివాసులు, అధ్యక్షుడు మండికారి బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టే విధంగా వారిని ప్రోత్సహించేందుకే స్టడీ మెటీరియల్ అందించామన్నారు. గణితంలో ఉన్న భయాన్ని పోగొట్టే విధంగా సులభరీతిలో గణితం నేర్చుకునే విధంగా సూచనలు, సలహాలు, సంక్షిప్త పద్ధతులను తెలిపారు. పాఠశాల నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10వేల నగదు పారితోషికం ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, హెచ్ఎం జీవన్‌కుమార్, మాధవి, లక్ష్మీబాయి, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువకుడు అదృశ్యమైన ఘటనలో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సాయిరాం గతేడాది అక్టోబర్31న తల్లి వద్ద గొడవ పడి బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాధిత కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మైలారంలో తల్లీకూతురు..

బల్మూర్: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన శిరీష(27)తోటు ఏడాది పాప అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమాదేవి వివరాల ప్రకారం గురువారం పాపను వెంటబెట్టుకొని మహిళ శిరీష బయటకు వెళ్లింది. బాధిత కుటుంబసభ్యులు బంధువులు, గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం శిరీష భర్త గద్దం రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

తెలకపల్లి: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేష్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓ ప్రైవేట్ యాప్‌లో డబ్బులు పెట్టి కొందరు మోసపోయారని గుర్తు చేశారు. రెట్టింపు డబ్బులు ఇస్తామని ఆశ చూసి ఉన్న డబ్బులు కాజేశారని వివరించారు. మండలంలో సైబర్ క్రైంకు సంబంధించి రెండు కేసులు నమోదు అయినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా మోసపోయినట్లయితే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930కి సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని ఎస్ఐ తెలిపారు.

అధ్వానంగా మట్టి రోడ్లు



జూపల్లి నుంచి నెమలి గుట్ట తండాకు వెళ్లే రోడ్డు ఇలా..



గుంతలమయంగా జూపల్లి - వంగూరు గేట్ మధ్య రోడ్డు

చారకొండ: మండలంలోని గ్రామాలను కలుపుతూ అనుసంధానంగా నిర్మించిన మట్టిరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మట్టి రోడ్ల నిర్వహణపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వహించడంతో పూర్తిగా గుంతలమయంగా మారాయి. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండటంతో ప్రమాదాలబారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. దీనికి తోటు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మరమ్మతుకు నోచుకోని రోడ్లు

ఆయా గ్రామాలకు రాకపోకలు కొనసాగిస్తున్న మట్టిరోడ్లకు అధికారులు మరమ్మతు పనులు చేయడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షాకాలంలో గుంతలలో వర్షం నీరు నిల్వడంతో వాహనదారులు ప్రమాదాలబారిన ఘటనలు ఉన్నాయి. కొన్ని చోట్ల బీటీరోడ్లు మంజూరైన కంకర పరిచి వదిలేశారు.

రెండు సంవత్సరాల కిందట జూపల్లి నుంచి నెమలి గుట్ట తండాకు కంకర వేసి అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. కంకరపై వెళ్లేందుకు వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. జూపల్లి నుంచి వంగూరు గేట వరకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. గోకారం గేట్ నుంచి చంద్రాయన్ పల్లి వరకు(5 కిలోమీటర్లు), కమాల్‌పూర్ తండా నుంచి బొమ్మల గుడిసెలు వరకు మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతింది.

ప్రమాదకరంగా బ్రిడ్జి

మండలంలోని గోకారం నుంచి చంద్రాయన్‌పల్లి వెళ్లే మట్టి రోడ్డుపై నిర్మించిన బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. రక్షణ గోడలు లేకపోడంతో ఇరు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళలో వాహనదారులు గతంలో పలు ప్రమాదాలకు గురై గాయాలైన ఘటనలు ఉన్నాయి. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

బీటీలుగా ప్రొసీడింగ్‌లు

జూపల్లి నుంచి వంగూరు గేట్ వరకు, జూపల్లి నుంచి లింగారెడ్డి పల్లి వరకు, చంద్రాయన్‌పల్లి నుంచి బైరాపూర్ వరకు, సారంబండ తండా నుంచి నూకల చింత వాడిక తండాకు మట్టిరోడ్లను త్వరలో బీటీలుగా మారుస్తామని గతంలో కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు ప్రొసీడింగ్‌లు ఇచ్చారు. కాని ఆచరణలో ఏమాత్రం కనిపించడం లేదు.

బీటీగా మార్చాలి



నెమలి గుట్ట తండాకు రెండు సంవత్సరాల కిందట ఉన్న మట్టి రోడ్డును అప్పటి ప్రభుత్వం బీటీగా మార్చేందుకు నిధులు కేటాయించి, పనులు ప్రారంభించారు. కంకర పరిచి పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఇతర గ్రామాలకు వెళ్లాలంటే, కంకర రోడ్డుపై ప్రయాణం చేయాలేకపోతున్నాం. అధికారులు, పాలకులు స్పందించి బీటీగా మార్చాలి.

– శివలాల్, నెమలిగుట్ట తండా

ప్రమాదకరంగా బ్రిడ్జి



గోకారం– చంద్రాయన్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. బ్రిడ్జికి రక్షణ గోడలు లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నాం. ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకముందే చర్యలు చేపట్టాలి.

– నాగేష్, గోకారం

బీటీ పనులు చేపట్టాం

చారకొండ మండల కేంద్రం నుంచి రాంపురం వరకు 2 కిలోమీటర్ల వరకు రూ.3.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇటీవల పనులకు శంకుస్థాపన చేశాం. మండలంలోని జూపల్లి నుంచి వంగూరు గేట్, సారంబండ తండా రోడ్డు, చంద్రాయన్‌పల్లి బైరాపూర్, తుర్కలపల్లి గోకారం తదితర రోడ్లు మంజూరయ్యాయి. రోడ్లకు టెండర్లు పూర్తి కాలేదు. ఇతర మట్టి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదు.

– దివ్య, పీఆర్ ఏఈ, చారకొండ మండలం

రహదారి భద్రత అందరి బాధ్యత

పెద్దకొత్తపల్లి: రహదారి భద్రత అందరి బాధ్యత అని డీటీఓ మహేష్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు సేఫ్టీ రూల్స్‌పై విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం డీటీఓ మహేష్ స్థానిక ఎస్ఐ సతీష్‌కుమార్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. వాహనదారులు రోడ్డు నియమనిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించొచ్చన్నారు. పోలీసులకు, అధికారులకు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న డీటీఓ మహేష్

కార్యక్రమంలో ట్రస్మా కొల్లాపూర్ నియోజక అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, ఆల్ సెయింట్స్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జోసెఫ్ మాథ్యూ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నాణ్యమైన మొక్కలను పెంచాలి



వెల్దండ: నర్సరీలలో నాణ్యమైన మొక్కలను పెంచాలని డీఆర్‌డీఓ పీడీ ఓబులేషు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుండాల, చెర్కూర్, పోషమ్మగడ్డతండాలలోని నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీలల్లో పెంచుతున్న మొక్కలు రైతులకు ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. పండ్ల మొక్కలు, అలంకరణ, పూల మొక్కలను పెంచి ఇంటింట అందించాలన్నారు. ప్రతి నర్సరీకి ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిల్లో మొక్కలు ఎండిపోకుండా సక్రమంగా నీరు అందించాలన్నారు. అదే విధంగా ప్రతి నర్సరీకి గ్రీన్ మ్యాట్ వేయాలన్నారు. అదే విధంగా గుండాల దేవాలయ ఆవరణంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను, మూత్రశాలల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈసీ దేవేందర్‌గౌడు, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ: ఇరువురికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొని ఇరువురికి గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్‌బండ్‌పై శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు కోడేరు మండలం ముత్తిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివ, చిన్నమ్మ దంపతులు ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తుండగా మినీట్యాంక్ బండ్‌పై కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న దంపతులకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానించిన కేటీఆర్



కల్వకుర్తి: కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్‌లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో సన్మానించారు. శాలువా కప్పి, మెమెంటో బహూకరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, శాసన మండల సభ్యుడు నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు, భక్తులు

కొల్లాపూర్: పట్టణంలో ఈదమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, విజయమ్మ దంపతులు విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సురభి రాజవంశ వారసులు ఆదిత్య లక్ష్మారావులు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు హాజరయ్యారు. ఆడపడుచులకు ఒడిబియ్యం పోశారు. ప్రజలు వేలాదిగా వచ్చి ఈదమ్మ దేవతను దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఉత్సవాలను ఆలయ పునర్నిర్మాణ కమిటీ నాయకులు పర్యవేక్షించారు. నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాంచందర్ యాదవ్, సాకలినర్సింహ, సాంబశివుడుయాదవ్, కట్టా శ్రీనివాసులు, కాటం జంబులయ్య, బిజ్జ వేణు, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



చారకొండలో వాసవీమాతకు పూజలు నిర్వహిస్తున్న పూజలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతం, అభిషేకం కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వాసవీమాత పారాయణం, అమ్మవారి పల్లకి సేవ, గీతా పారాయణం, సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అనంతరం హోమం నిర్వహించి హోమగుండంలో అమ్మవారి అగ్ని ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహామంగళ హారతితో కార్యక్రమాలు ముగిశాయి. పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జూలూరు రమేష్ బాబు, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు శేఖర్, మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు బాదం రాఘవేందర్, మహిళా సంఘం అధ్యక్షురాలు మౌనిక, యువజన విభాగం అధ్యక్షుడు తరుణ్, ఆర్యవైశ్య మహాసభ, ఆవోపా, వాసవీ, వనిత క్లబ్ సభ్యులు, మహిళలు, ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో ఉత్సవాలకు హాజరయ్యారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వాసవీమాత విగ్రహానికి ఆర్యవైశ్యులు అభిషేకాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు సుదర్శన్ శెట్టి, స్వామి, ప్రేమ్‌కుమార్, అర్థం రవి, కొండా శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

అమ్మవారికి పూజలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయం వద్ద శుక్రవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యజ్ఞయాగాలు చేసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గీతారాణి, సువర్ణ, సంధ్య, జ్యోతి, పద్మ, అరుణ, కవిత, శ్రీదేవి, విమల, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారాయణం, కుంకుమార్చన

చారకొండ: మండల కేంద్రంలో శ్రీలక్ష్మి పద్మావతి వేంకటేశ్వర దేవాలయంలో వాసవీమాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి పారాయణం, అభిషేకం, కుంకుమార్చన, కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో అనిత, విజయలక్ష్మి, నర్మదా, సంతోష, వరలక్ష్మి, వజన, శ్వేత, సంధ్య, నిర్మల, హరిత, శివలీల, మణెమ్మ, మంగమ్మ, ప్రమీల భక్తులు తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

నాగర్‌కర్నూల్ క్రైం: అంకితభావంతో పని చేస్తే ప్రతి ఉద్యోగికి గుర్తింపు ఉంటుందని అదనపు ఎస్పీ రామేశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా పనిచేసిన ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏఎస్పీ హాజరై మాట్లాడారు. పదవీవిరమణ తర్వాత కుటుంబసభ్యులతో ప్రశాంత జీవితం గడపాలని ఆకాంక్షించారు.

సూర్య దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



తాడూరు: మండలంలోని భల్లాన్‌పల్లిలో సూర్య దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. విరాళాలు సేకరించి దాతల సహాయ సహకారాలతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 3 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

మామిడిలో వాడిపోతున్న మామిడి పూత

వీపనగండ్ల: ఉద్యాన పంటల సాగుకు ఆర్థికంగా తోడ్పాటు అందించి రైతులకు అండగా ఉంటామని ప్రభుత్వం, అధికారులు చెబుతున్నా మామిడి తోటలు పెంచుతున్న రైతుల పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా తయారవుతోంది. దీనికి తోడు అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించకపోవడంతో మామిడికి ఆశించే చీడపీడల దాటికి రైతులు కుదేలు అవుతున్నారు. నాలుగేళ్లుగా నష్టపోతున్న మామిడి రైతుల గోసను పట్టించుకునేవారే కరువయ్యారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మామిడి రైతులకు పెట్టుబడి సాయంతో పాటు మద్దతు ధర, మార్కెట్ వసతులు కల్పించాలని కోరుతున్నారు.

4,801 ఎకరాల్లో మామిడి సాగు

మండలంలోని 10 గ్రామాల్లో 4,801 ఎకరాలలో రైతులు మామిడి తోటలను సాగుచేస్తున్నారు. బొల్లారంలో 183 మంది రైతులు 404 ఎకరాల్లో, కొర్లకుంటలో 90 మంది 182 ఎకరాలు, వల్లభాపురంలో 39 మంది 65 ఎకరాలు, గోపల్‌దిన్నెలో 162 మంది 386 ఎకరాలు, గోవర్ధనగిరిలో 385 మంది 837 ఎకరాలు, కల్వరాల 128 మంది 338 ఎకరాలు, పుల్గర్‌చర్లలో 88 మంది 192 ఎకరాలు, సంగినేనిపల్లిలో 79 మంది 243 ఎకరాలు, తూముకుంటలో 263 మంది 602 ఎకరాలు, వీపనగండ్లలో 514 మంది 1201 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు.

నల్లబారుతున్న తోటలు

మూడేళ్లుగా నష్టాలను చవిచూస్తున్న మామిడి రైతులు ఈ సీజన్‌లోనైనా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వస్తుందని భావించినా.. ఆకుముడత, తేనేమంచు, నల్లబారుతున్న పూతలు, పచ్చపురుగు తదితర చీడపీడల వల్ల వచ్చిన కొద్దిపాటి పిందెలు కూడా నేలరాలుతుండడంతో రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. అయినా ఆశించి ఫలితం లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు.



వీపనగండ్ల శివారులో నల్లబారుతున్న మామిడి తోటలు

ప్రతి ఏటా దళారుల బారిన..

స్థానికంగా మామిడి మార్కెట్ లేకపోవడంతో కాయలను విక్రయించాలంటే జడ్చర్ల, హైదరాబాద్ పట్టణాలకు వెళ్లాల్సిందే. దీంతో రవాణా ఖర్చులతో పాటు తరుగు పేరుతో దళారులు మామిడి రైతులను నిండా ముంచుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి పాన్‌గల్, చిన్నంబావి, శ్రీరంగాపురం మండలాల రైతులకు అనువుగా ఉన్న వీపనగండ్ల మండల కేంద్రంలో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వాతావరణ పరిస్థితుల వల్లే..

ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల మూడేళ్లుగా మామిడి తోటల్లో సరైన దిగుబడి రావడం లేదు. తేనెమంచు తెగుల వల్ల తోటలకు అధిక నష్టం వాటిల్లుతుంది. మార్కెట్ ఏర్పాటు కోసం అవసరమైన నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– కృష్ణ, మండల ఉద్యాన శాఖ అధికారి, వీపనగండ్ల

గద్దర్‌కు ఘన నివాళి



మన్ననూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కల్వకుర్తి పట్టణంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ విగ్రహావిష్కరణ కమిటీ చైర్మన్ లక్ష్మణ శర్మ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలతో యువకులను చైతన్యం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో శేఖర్, బొజ్జన్న, గోపాల్, సైదులు, పర్వతాలు, రజిత తదితరులు పాల్గొన్నారు.

■ మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో గద్దర్ 77వ జయంతిని అమ్రాబాద్ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు దూమర్ల ఎల్లస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అణగారిన, పీడిత, వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడారని వక్తలు కొనియాడారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు నసీర్, మంతటి పర్వతాలు, లక్ష్మీనారాయణ, తిరుమలయ్య, రెహమాన్, లింగం, దివాకర్, నిరంజన్, వెంకటయ్య, రామనాథం, కర్లయ్య, సైదులు, రమణ, రాఘవేందర్, మాసయ్య, లింగయ్య, ఎస్టీ వసతి గృహం విద్యార్థులు పాల్గొన్నారు.

■ వెల్దండ మండల కేంద్రంలో గద్దర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, యాదగిరి, రాములు, తిరుపతి, సుదర్శన్, ఆనంద్, సుధాకర్, ప్రవీణ్, ప్రశాంత్, భిక్షపతి, శేఖర్, గోపాల్, రజితక్క, బొజ్జయ్య, సువర్ణ తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

■ బల్మూర్ మండల కేంద్రంలో గద్దర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీశైలం, గణేష్, తిరుపతయ్య, రఫీ, వెంకటయ్య, చాంద్‌పాషా పాల్గొన్నారు.

■ అమ్రాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం విజయ్‌మోహన్, ఉపాధ్యాయబృందం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

వీపనగడ్డ: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మండల కేంద్రానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్ ప్రథమ స్థానం, అశోక్, శిరీష ద్వితీయ స్థానం సాధించారు. వారిని పాఠశాల జీహెచ్ఎం భానుప్రకాష్ అభినందించి బహుతులను అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు మహేశ్వర్, మోహన్, రఘు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆన్‌లైన్ ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఠాగూర్‌నాయుడు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం శ్రీనిధి జెడ్పీహెచ్ఎస్ దుప్పల్లి, ద్వితీయ స్థానం సాయికుమార్ జెడ్పీహెచ్ఎస్ అజ్జకొలు విద్యార్థి సాధించారు. పాఠశాల ఇంచార్జ్ మహేందర్‌గౌడ్ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, మూలే ఆంజనేయులు ఈశ్వర్ లాల్ పాల్గొన్నారు.